## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

**ఆత్మకూరు:** పట్టణంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ఆకు పూజ, ప్రత్యేక హారతులు, ఇతర పూజలు నిర్వహించి, మహామంగళ హారతి చేపట్టారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ఆదివారం సాయంత్రం కోటి దీపారాధన మహోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

### లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వరరావు

**ఆత్మకూరు:** పట్టణంలోని కోర్టులో డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న మెగా జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టులో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాజీకాదగిన కేసులను కక్షిదారులతో మాట్లాడి మెగా జాతీయ లోక్‌అదాలత్ పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రత్యేక పాఠశాల తనిఖీ



జడ్జి సమక్షంలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

**ఆత్మకూరురూరల్:** మండలకేంద్రమైన వెలుగోడులోని క్రాంతి మూగ, చెవిటి బుద్ధి మాంద్య పిల్లల ప్రత్యేక పాఠశాలను ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి, మండల న్యాయసేవా సమితి చైర్మన్ వెంకటేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. పిల్లలకు సరైన వసతులు ఉన్నాయా లేవా పరిశీలించడమే కాకుండా ఆయన తనవెంట వచ్చిన వైద్యులతో పిల్లలకు కంటి, ఆర్థోపెడిక్ పరీక్షలు చేయించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులైన వారికి చట్టంలో ప్రత్యేక రక్షణ కల్పించబడినట్లు తెలిపారు.

### తాండవ మల్లేశ్వరస్వామికి పూజలు



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

**కొత్తపల్లి:** మండల కేంద్రంలో కొత్తపల్లిలో వెలసిన పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తులు చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహమూర్తులను పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఎద్దులేరు వాగు పరిశీలన

**కొత్తపల్లి:** మండలంలోని ఎం.లింగాపురం, శివపురం గ్రామాల మధ్యలో ఉన్న ఎద్దులేరు వాగును ఆర్‌అండ్‌బీ ఏఈఈ రవికాంత్ శనివారం పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేసిన నేపథ్యంలో ఎద్దులేరువాగును పరిశీలించామన్నారు. రూ. 3.40కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, సీపీఎం నాయకులు సంజీవరాయుడు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

### ఇనుప కంచె ఏర్పాటు

**కొత్తపల్లి:** కార్తీక మాసం నేపథ్యంలో సప్తనది సంగమేశ్వరంలో ఎగువ పుష్కర ఘాట్‌వద్ద భక్తులు స్నానాలు చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా శనివారం ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఎనుప కంచె(జాలర్) ఏర్పాటు చేశారు. ఆత్మకూరుకు చెందిన భక్తుడు వెంకట నాగేశ్వరరావు రూ. 25 వేల అందజేయగా జాలర్ ఏర్పాటు చేశామని తెలకపల్లి రఘురామ శర్మ తెలిపారు.

### వర్షపాతం సక్రమంగా నమోదు చేయాలి

**జూపాడుబంగ్లా:** వర్షపాత నమోదును సక్రమంగా నిర్వహించాలని జిల్లా ముఖ్యప్రణాళికాధికారి వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆయన జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వర్షపాత నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. బీకరు, కొలమాన పాత్రలను పరిశీలించారు.

# మహానందిలో కార్తీక సందడి



శనివారం రాత్రి మహానందీశ్వరుడి దర్శనార్థ క్యూలైన్లలో వేచివున్న భక్తులు

**మహానంది:** కార్తీక మాసం, వీకెండ్ సందర్భంగా మహానంది ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి నందిస్తూపం, నాగుల కట్ట, రాజగోపురం ముందు భాగాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. మధ్యాహ్నం శ్రీ మహానందీశ్వరస్వామి, శ్రీ కామేశ్వరీదేవి అమ్మవార్లకు నివేదన సమర్పించిన అనంతరం నుంచి రాత్రి వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది.

**మహానందీశ్వరుడి సన్నిధిలో..**

**మహానంది:** మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రమణరావు శనివారం రాత్రి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగ్

**జూపాడుబంగ్లా:** పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్‌ఎంలు కృషిచేయాలని డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగ్ సూచించారు. శనివారం ఆయన జూపాడుబంగ్లా మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఎమ్మార్సీలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఎఫ్‌ఏ2లో సాధించిన మార్కుల వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా స్టడీ అవర్స్ నిర్వహించాలని ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ ఆదేశించారు. అపార్ నమోదులో మండలం లో కేవలం 63శాతంతో వెనుబడిందని వేగవంతం చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి, గురుకు ల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో లక్పతి దీదీ స్కీమ్

**బండిఆత్మకూరు:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్పతి దీదీ స్కీమ్ అందుబాటులోనికి వచ్చిందని యూనియన్ బ్యాంకు లీడ్ మేనేజర్ రవీందర్ తెలిపారు. శనివారం బండిఆత్మకూరు బ్రాంచిలో ఆయన స్కీమ్ ఆవశ్యకత, ఉపయోగాలను ఎస్‌ఎస్‌జీ మెంబర్స్‌కి వివరించారు. అలాగే బ్యాంకులో వివిధ రకాల సర్వీసులైన ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా తదితర సర్వీసులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇవే కాక ఎస్‌ఎస్‌జీ గ్రూప్‌లో ఉన్న మెంబర్స్ పిల్లలకి ఎడ్యుకేషన్ రుణాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బండిఆత్మకూరు గ్రామ ప్రజలందరూ యూనియన్ బ్యాంక్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ తిరుపాల్ నాయక్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఎస్‌ఎస్‌జీ మెంబర్లు పాల్గొన్నారు.

## భారీ వాహనాలను అడ్డుకున్న రైతులు



భారీ వాహనాలను అడ్డుకున్న రైతులు

**పాములపాడు:** మండలంలోని చెలిమిల్ల గ్రామంలో హైవే పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు లచ్చలగౌడు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం భారీ వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించకూడదన్నారు. అధిక లోడు మట్టితో వాహనాలు తిరగడం వలన ఇప్పటికే రహదారి పూర్తిగా దెబ్బతినిందని వాపోయారు. ఇళ్లలోకి విపరీతంగా దుమ్ము చేరుతుందని, అనారోగ్యాల పాలవుతున్నామన్నారు. అదేవిధంగా పంటలపై దుమ్ము పడడం మూలంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహన యజమానులను పలుమార్లు హెచ్చరించినా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రహదారి వెంట కనీస ట్యాంకర్లతో నీరు చల్లండని చెప్పినా పెడచెవిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకర్లతో ప్రతి రోజు రహదారి వెంట నీరు చల్లిస్తామని వాహనాల యాజమానులు చెప్పడంతో దారి ఇచ్చారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు



చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దిలేటి

**మిడుతూరు:** మండల పరిధిలోని తలముడిపి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దిలేటి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్థ్య జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా పద్దెనిమిదేళ్లలోపు పిల్లలకు ఈ పరీక్షలు చేస్తున్నామన్నారు. అనారోగ్య సమస్యలను తొలి దశలోనే గుర్తించి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రేఫర్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ బాల సుబ్బారెడ్డి, పీహెచ్‌ఎన్ కిరణ్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ ప్రజలు, నాయకులు

**నందికొట్కూరు:** ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ, రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బేబికి కాలనీ వాసులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు మోటార్ నెల కిందట మరమ్మతులకు గురైనా చేయించకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మల్లేశ్వరమ్మ, అబ్దుల్లా, మాబాషా, శ్యామ ల, షర్మిల, మంగమ్మ, ముని తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతి

**మిడుతూరు:** తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ తిరుపతి అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల ప్రాముఖ్యత, చిన్నారులకు వేసే వ్యాక్సిన్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పుట్టిన నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. అదేవిధంగా చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్ వేయిస్తే ప్రమాదకరమైన రోగాలు సోకవని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శారద, సిబ్బంది ముర్తుజావలి, సువేధ, తులసి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పొలాల్లో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

**జూపాడుబంగ్లా:** మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన సతీష్‌బాబు, తంగడంచ గ్రామంలో వెంకటరమణ మొక్కజొన్న పొలాల్లో పంటకోత ప్రయోగం నిర్వహించారు. చుట్టూ ఐదుమీటర్ల కొలతల్లో పంటకోత ప్రయోగం నిర్వహించి లెక్కించగా మండ్లెంలో 28.7కిలోలు, తంగడంచలో 15.66కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. తమ పరిశీలనలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ముఖ్యప్రణాళికాధికారి వేణుగోపాల్ తెలిపారు. ఏఎస్‌ఓ హనుమంతు, పంటలబీమా బ్యాంకు కన్సల్టెన్సీలు అజ్మతుల్లా, వీఆర్‌ఓ ఈశ్వరయ్య, వీహెచ్‌ఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### బేగరీల సమస్యలు పరిష్కరించాలి

**పాములపాడు:** శ్మశాన వాటికల్లో గుంతలు తీసే బేగరీల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల రాజు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా శ్మశాన వాటికల్లో చేస్తున్న బేగరీల పనికి ఎలాంటి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శవాలను పూడ్చడం, కణనం చేయడం , మూగజీవాలు చనిపోతే వాటిని తరలించడం వంటి పనులు చేస్తున్నను వారిని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. కార్యక్రమంలో బేగరి సంఘం మండల నాయకులు ఈశ్వరయ్య, రాజు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

### 18న వనభోజనం

**పగిడ్యాల:** కార్తీక మాసాన్ని పురష్కరించుకొని స్థానిక ఉమమహేశ్వర దేవాలయంలో ఈ నెల 18 వ తేదీన ఏర్పాటు చేయనున్న వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు చల్లా దామోదర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తరుపున హైదారాబాదు ఎంపీగా పోటీసిన మాధవీలత హాజరవుతారని, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

### అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**పగిడ్యాల:** టీడీకీ కూటమి ప్రభుత్వం అర్హులందకి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆరు గ్యారెంటి పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

### తూకాల్లో మోసాలకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

**మహానంది:** రేషన్ డీలర్లు నిత్యావసర వస్తువుల తూకాల్లో మోసాలకు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మహానంది తహసీల్దార్ రమాదేవి కోరారు. కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు రేషన్ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యం, కందిబేడలు, చెక్కెర, తదితర వస్తువులను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తోందన్నారు. అయితే కొందరు డీలర్లు డబ్బాలు పెట్టి పేదలను మోసం చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ చేపట్టామన్నారు. గ్రామాల్లోనూ ఎవరైనా డీలర్లు అక్రమాలకు పాల్పడితే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### రక్తదానం

**నంద్యాల(వ్యవసాయం):** అయోధ్య కరసేవలో బలిదానమైన కొటారి సోదరులను స్మరించుకుంటూ భజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బచ్చు సంతోష్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువత మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని, మీ చర్య కారణంగా పలువురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. శిబిరంలో 30మంది భజరంగదళ్ కార్యకర్తలు రక్తదానం చేశారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, చంద్రమౌళీశ్వరరెడ్డి, కమ్మయ్య, బాబు, వెంకటసుబ్బయ్య, నాగిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

**నందికొట్కూరు:** పట్టణంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం విలేకరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూ నియోజకవర్గ అధ్యక్షుడు నగేష్, గోపి, స్వామన్న, జయరాజు, స్వాములు, ప్రతాప్, జలీల్, జంబులయ్య, ఆంజనేయులు, హుసేనాళం తదితరులు పాల్గొన్నారు.

### సారా బట్టీలపై దాడులు



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ కిషోర్‌కుమార్, పోలీసులు

**ఆత్మకూరు:** మండలంలోని కొట్టాల చెరువు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్లుఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. కురుకుంద గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు వీరస్వామి, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ నేతల సేవలు ప్రశంసనీయం



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మద్దమ్మ, చిన్నారులు

**పగిడ్యాల:** గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొని వాటి సాధనకు కృషిచేసిన డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్, పాటూరి నాగభూషణం, వెంకటరమణయ్య తదితరుల సేవలు ప్రశంసనీయమని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో ఉద్యమ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమాల ఫలితమే గ్రంథాయాలు**

**పాములపాడు:** మహనీయుల నాటి ఉద్యమాల ఫలితమే గ్రంథాలయాలు నెలకొల్పబడ్డాయని సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆళ్లగడ్డ హరిసర్వోత్తమరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, డాక్టర్ అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ క్రిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచు నబిరసూల్, మాజీ పీఎంసీ చైర్మన్ జలాల్‌సా, వార్డు సభ్యుడు మద్దిలేటి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి**

**బండిఆత్మకూరు:** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక భవిష్య పాఠశాలలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. లైబ్రేరియన్ డి.మధు, మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, డా.ఎస్‌ఆర్.రంగనాథం, పాతూరి నాగ భూషణం చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు చిత్ర లేఖనం, ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భవిష్య పాఠశాల కరెస్పాండెంట్ వర ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జయగోపాల్, గ్రంథాలయ సిబ్బంది హుస్సేన్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర్య సాధనలో గ్రంథాలయాల పాత్ర కీలకం**

**వెలుగోడు:** స్వాతంత్ర్య సాధనలో గ్రంథాలయాల పాత్ర కీలకమైనదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారిణి సుమలత పాల్గొన్నారు.

## ఎస్‌ఐ సంరక్షణలో బాలుడు



ఎస్‌ఐతో ఉన్న బాలుడు గోపాల్

**బండిఆత్మకూరు :** మండల కేంద్రంలో అనుమానాస్పదంగా కనిపించిన బాలుడు ప్రస్తుతం తన సంరక్షణలో ఉన్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని గుర్తించిన ఫైర్ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకురాగా, బుజ్జగించి వివరాలు అడుగగా తన పేరు గోపాల్ అని, 14ఏళ్ల వయస్సు, తనది తెలంగాణలోని మహబూబాబాద్ అని చెప్పాడన్నారు. చదువు మీద ఆసక్తి లేక ఈ నెల 4వ తేదీ ఇంటి నుంచి పారిపోయి ఇక్కడికొచ్చినట్లు వెల్లడించాడన్నారు. అతని తల్లిదండ్రులకు సమాచారమిచ్చామని, వారు బయలుదేరి వస్తున్నారని తెలిపారు. వారు వచ్చేంతవరకు బాలుడు తన సంరక్షణలోనే ఉంటాడని వెల్లడించారు.

## గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

**పాములపాడు:** గ్రామాల అభివృద్ధి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాటుపడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజిని వర్షిణీయ, ఈఓపీఆర్డీ రంగనాయకులు, పశువైద్యాధికారి అనీల్, జేఈ రాఘవేంద్ర ప్రతాప్, ఏపీఓ విమలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితప్రభావతి, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

**మిడుతూరు:** గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రణాళికలు తాయారు చేసుకోవడంలో పారదర్శకంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, పీఆర్ ఏఈ ప్రతాపరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయాల్లో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



ప్రథమనంది ఆలయంలో జడ్జి దంపతులకు ఆశీర్వచనం పలుకుతున్న అర్చకులు

**నంద్యాల(వ్యవసాయం):** కర్నూలు ఉమ్మడి జిల్లా జడ్జి కబర్థి దంపతులు నంద్యాలలోని నవనందుల్లో మూడు నందులను శనివారం సాయంత్రం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వెలసిన నాగనందీశ్వరుడిని దర్శించుకోగా.. ఆలయ ఈఓలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రథమనంది దేవస్థానంలో ఈఓ, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువాతో సన్మానించారు. సోమనంది ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈఓలు వేణునాథరెడ్డి, రామానుజన్, కోర్టు సిబ్బంది నరేష్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## దేవస్థానం భూమిలో రస్తా విషయంలో వివాదం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

**మహానంది:** మహానందిలోని నంది విగ్రహం ఎదురుగా మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన పొలాలు ఉన్నాయి. దేవస్థానం పొలాల వెనుక రెండు సర్వే నెంబర్లలో ఓ వ్యక్తికి చెందిన 1.20 సెంట్ల స్థలం ఉంది. దీంతో ఆయన తన స్థలంలో అభివృద్ధి పనులు చేయనున్నట్లు, ఆ పొలానికి దేవస్థానం భూముల నుంచి దారి వేసేందుకు యత్నించాడు. దీంతో ఆలయ ఏఈఓ వై.మధు, తహసీల్దార్ రమాదేవి, స్థానికులు, స్వామి వారి భక్తులు పొలం వద్దకు చేరుకోగా వాదోపవాదాలకు దిగాడు. దీంతో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే చేయగా దారి లేదని తేలడంతో వివాదం సద్దుమణిగింది.

## ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న అసిస్టెంట్ మేనేజర్‌ను సన్మానిస్తున్న బ్యాంక్ అధికారులు

**వెలుగోడు:** ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని కెనరా బ్యాంకు ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ సుభాషిని అన్నారు. శనివారం పట్టణంలోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వీరన్న హెచ్ కైరవాడి బ్రాంచ్‌కి బదిలీ అయిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, వీరన్న తక్కువ సమయంలో ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందారన్నారు. అనంతరం వీరన్నను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవళిక, సిబ్బంది కేఎండీ హుస్సేన్, నాగరాజు, విజయ్ కుమార్, ఆచారి, రమేష్ పాల్గొన్నారు.